సాక్షి ములుగు

సోమవారం ౹ 22 ౹ మే ౹ 2023



విత్తనశుద్ధితో చీడపీడలకు చెక్

విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా మొక్కలను ఆశించే చీడపీడల నుంచి రక్షించుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజు పేర్కొన్నారు.

- 8లో▸



పిచ్చి కుక్క స్వైరవిహారం

మరిపెడ మండలంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసి గంట వ్యవధిలోనే 13 మందిని తీవ్రంగా గాయపర్చింది.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$43.3^0 / 23.5^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి క్రీడా పోటీలు

ఏటూరునాగారం: మండల పరిధిలోని నేటి నుంచి నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మైదానం ముస్తాబు అయ్యింది. నేటి నుంచి బుధవారం వరకు ఏర్పాటు చేసే పోటీల్లో పాల్గొన్నాలని తెలిపారు. ఈ జిల్లా స్థాయి క్రీడాపోటీలకు కోర్టు, షామియాలు, విద్యుత్ లాంటి పలు అభివృద్ధి పని ఉంటుందని తెలిపారు.

సమయపాలన పాటించాలి



ములుగు: ప్రభుత్వ నిబంధనల మేరకు వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య సూచించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి లేబర్ రూంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులతో మాట్లాడి సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించారు. ఎస్ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. బాలింతకు కేసీఆర్ కిట్ అందించారు. ఈడీడీ ఆధారంగా ప్రతి గర్భిణికి ఫోన్ ద్వారా సమాచారం అందించి ఆస్పత్రికి రావాలని సూచించారు. డాక్టర్ చిరంజీవి, స్టాఫ్‌నర్సు డెలివరీ చేయడానికి సిద్ధంగా ఉండడం చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు.

లారీ అసోసియేషన్ కమిటీ ప్రమాణ స్వీకారం



భూపాలపల్లి అర్బన్: ది కాకతీయఖని లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. లారీ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా బానోత్ బాల్‌చంద్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా బిల్ల అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సభావత్ వెంకట్రామ్, సహాయ కార్యదర్శిగా గండి చిరంజీవి, కోశాధికారిగా బేతీ రమేష్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ నాయకులు కొటం సురేందర్, వెంకన్న, తిరుపతి, రాజు, భిక్షప తి, జనార్దన్, రియాజ్, సాంబరెడ్డిలు పాల్గొన్నారు.

అర్హత పరీక్ష ప్రశాంతం



కేయూ క్యాంపస్: వివిధ పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ఎస్సీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 422 మంది దరఖాస్తు చేసుకోగా 261 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు స్టడీ సర్కిల్ రాష్ట్ర గౌరవ సంచాలకులు ఆచార్య ఎర్రగట్టుస్వామి తెలిపారు. ఇందులో అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఐదు నెలలపాటు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు బాలురు, బాలికలకు వేర్వేరు హాస్టలవసతితో వరంగల్‌లోనే ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు రూ.2,500 విలువగల స్టడీ మెటీరియల్ అందజేస్తామని చెప్పారు. అర్హత పరీక్షను ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, ఏఎస్‌డబ్ల్యూఓ కె.రాజమౌళి, అహ్మద్ అమీన్ పరిశీలించారు.

రెడ్ క్రాస్‌ను పరిశీలించిన అక్రిడిటేషన్ బోర్డు



హన్మకొండ అర్బన్ : నగరంలోని హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీలోని రక్త నిధి కేంద్రాన్ని నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్, హెల్త్ కేర్ ప్రొవైడర్స్ డాక్టర్లు శశికాంత్, రాజీవ్ భాస్కర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రక్తసేకరణ, రక్త పరీక్షలు, పంపిణీ సమయంలో రక్తం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. వీటి అంచనాతో ఎన్ఏబీహెచ్ గుర్తింపు ఇవ్వనున్నారు. ఈ మేరకు సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం డాక్టర్లు శశికాంత్, రాజీవ్‌లను రెడ్‌క్రాస్ పాలకవర్గం సత్కరించింది. కార్యక్రమంలో చైర్మన్ పి.విజయచందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, మెడికల్ ఆఫీసర్లు కిషన్‌రావు, సత్యం పాల్గొన్నారు.

షాపెల్లిలో నామమాత్రంగా ఉన్న తునికాకు కల్లం



జీరో దందా

టైగర్ జోన్ ప్రాంతాల్లో తునికాకు సేకరిస్తున్న కాంట్రాక్టర్లు

- కల్లం వద్ద జీరో చూపెడుతూ లారీల్లో అక్రమంగా తరలింపు
- అధికారులు సైతం కాంట్రాక్టర్లకు సహకరిస్తున్న వైనం
- ఆన్‌లైన్ చెల్లింపుతో ఉపాధి హామీ పనులకే కూలీల మొగ్గు



ఏటూరునాగారం అడవిలో ముదిరిపోతున్న తునికాకు

ఏటూరునాగారం: తునికాకు సేకరణపై కూలీలు అనాసక్తి చూపుతున్నారు. దీంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. ఇదే అదునుగా భావించిన కాంట్రాక్టర్లు అనుమతి లేని టైగర్ జోన్ ప్రాంతాల్లో జీరో దందాను కొనసాగిస్తున్నారు. జిల్లాలోని గొత్తికోయగూడేలు ఐలాపురం, కొండాయి లాంటి అనేక ప్రాంతాల్లో అనుమతి లేకున్నా కాంట్రాక్టర్లు కూలీల చేత తునికాకు కోయించి డైరెక్ట్‌గా తరలిస్తున్నారు. అధికారుల లెక్కల్లో కల్లం వద్ద సేకరణ జీరో చూపెడుతుండగా ఆ ప్రాంతాల్లోనే కాంట్రాక్టర్లు ఆకును సేకరించి లారీల్లో అక్రమంగా తరలిస్తున్నారు. అటవీశాఖ అధికారులు సైతం కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతూ జీరో దందాకు మద్దతునిస్తున్నారు. ఇప్పటివరకు కేవలం ఐదారు డివిజన్లలోనే యూనిట్లు మొదలై కల్లాలను ఏర్పాటు చేశారు. మిగితా చోట్ల కాంట్రాక్టర్లు టెండర్లు వేసినా యూనిట్లలో కల్లాలను ఏర్పాటు చేయలేదు. కూలీలు ఎక్కువ మొత్తంలో ఆకు తెప్పేందుకు ఎవరు రాకపోవడంతో అక్రమమార్గంలో ఆకును తరలించడంపై మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. టెండర్ దక్కించుకున్న యూనిట్ పేరుతోనే మిగతా ప్రాంతాల్లో ఆకును అటవీశాఖ అధికారుల కనుసన్నల్లో తరలిస్తున్నట్లు సమాచారం.

ఉపాధి పనులకు మొగ్గు

తునికాకు సేకరణ చేసే కూలీలు దాదాపుగా ఉపాధి హామీ కూలీలే. దీంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు మొగ్గు చూపుతున్నారు. తునికాకుకు వెళ్తే డబ్బులు వస్తాయో రావో అని ఉపాధి హామీ అయితే పోస్టాఫీసు ద్వారా విధిగా వస్తున్నాయనే నమ్మకం వారిలో ఉంది. బోనస్ చెక్కులను సైతం బినామీ పేర్లతో దిగమింగుతున్నారని కూలీలు గతంలో అభియోగం మోపారు. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రభుత్వం ఆన్‌లైన్ పేమెంట్స్‌కు తెరలేపింది. దీంతో ఆన్‌లైన్ నగదు బదిలీలకు కూలీల ఖాతాలు, ఆధార్ కార్డులు, మొబైల్స్‌కు లింక్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ఆకులు సేకరించిన కూలీల బ్యాంక్, పోస్టాఫీసు ఖాతాల్లో నేరుగా ఆన్‌లైన్ ద్వారా డబ్బులను జమ చేయనుంది. కూలీల నుంచి సరైన ఆధారాలు, సమాచారం రాకపోవడంతో అటవీశాఖ చేతులు ఎత్తేసింది. 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3 ప్రభుత్వం చెల్లిస్తోంది. గతంలో రూ. 2.50 ఉండగా ఈసారి 50పైసలు పెంచి రూ. 3 లు ఇవ్వాలని నిర్ణయించింది. జీరో దందా చేయడంతో తక్కువ డబ్బులు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

తునికాకు సేకరణ లక్ష్యం వివరాలు

యూనిట్ పేరు	లక్ష్యం	స్టాండర్డ్ బ్యాగులు
ఏటూరునాగారం	1,400	0
తుపాకులగూడెం(ఎ)	1,300	0
తుపాకులగూడెం(బి)	600	0
షాపెల్లి	1,100	0
మొట్లగూడెం	1,100	0
తాడ్వాయి(బి)	500	115
తాడ్వాయి(ఎ)	500	135
నార్లాపూర్	700	0
నారాయణపూర్	700	134
పత్తిపల్లి(బి)	500	0
కర్లపల్లి	700	0
పస్రా	700	0
కొడిశాల(ఎ)	600	0
లింగాల	900	24
మంగపేట	800	125
మల్లూరు	1,600	25
కాటాపూర్(ఎ)	1100	255
కాటాపూర్(బి)	800	18
లవ్వాల	100	40
చీకుపల్లి	400	116
అలుబాక	900	133
వెంకటాపురం	900	201
పేరూరు	900	99
మొత్తం	18,800	1,494

మొత్తం 23 యూనిట్లలో 18,800 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ లక్ష్యం పెట్టుకోగా కేవలం 1,494 స్టాండర్డ్ బ్యాగుల ఆకును సేకరించారు. అటు ఆకును అక్రమంగా తరలించే విధంగా కాంట్రాక్టర్లు ప్లాన్ చేసుకోవడం గమనార్హం. దీనివల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గండిపడుతోంది.

లక్ష్యం మేరకు ఆకు సేకరణ జరగలేదు...

“ కాంట్రాక్టర్లు టెండర్ల ద్వారా యూనిట్లను దక్కించుకున్నారు. కానీ వారికి అనుకున్న లక్ష్యంలో ఆకు సేకరణ జరగలేదు. ఆన్‌లైన్ నగదు బదిలీ అని కూలీలకు చెప్పడంతో ఎవరు కూడా ముందుకు రావడం లేదు. దీనివల్ల ఆకు సేకరణ పూర్తి స్థాయిలో జరగలేదు.

- బాలరాజు, నార్త్‌జోన్ రేంజ్ అధికారి

ఉపాధి పనులకే వెళ్తున్నాం..

తునికాకు సేకరణకు పోయేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాం. తునికాకు డబ్బులు వస్తాయా రావ అనేది అనుమానంగా ఉంది. ఉపాధి పనుల డబ్బులు సక్రమంగా రావడంతో కూలీంతా కలిసి వంద రోజుల పనులకు పోతున్నాం.

- పోషమ్మ, ఏటూరునాగారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండలంలోని కాల్వపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను సీతక్క ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. శనివారం రాత్రి గాలిదుమారంతో ఇళ్లపై కప్పులు లేచిపోయి నష్టపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంక్షేమ రాష్ట్రం అని గొప్పలు చెప్పుకుంటున్న కేసీఆర్‌కు ప్రజలు పడుతున్న కష్టాలు కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో హామీలతో మోసం చేయడం తప్పా పేద ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని పార్టీ అధికారంలోకి రాగానే రూ. 5లక్షలతో ఇళ్లు కట్టి ఇస్తామన్నారు. కలెక్టర్ అధికారులతో సర్వే చేయించి గాలిదుమారం వల్ల నష్టపోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మల్లయ్య, మాజీ సర్పంచులు శ్రీనివాస్, సారయ్య, ఎస్సీసెల్ మండల ఉపాధ్యక్షుడు నారాయణ, నర్సింహులు, రమేష్, పర్సనేని నర్సింహులు, సుగుణ, పూలక్క, ఓదెలు, జగన్నాథరావు, బడే యాదగిరి, ఆలెం సతీష్, భూషబోయిన పుల్లయ్య, వెంకటయ్య, పుర్రి సమ్మయ్య, వాసం పెల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్

ములుగు: కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందని జెడ్పీ చైర్మన్, ములుగు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో ఆదివారం ఎస్ఎస్ తాడ్వాయి మండల ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్టీ ఆదేశాల మేరకు ఆత్మీయ సమ్మేళన సమావేశాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రతీ కార్యకర్తను భాగస్వాములుగా చేసి వారి అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. కార్యకర్త మనోగతాలను తెలుసుకునేందుకే సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం తరఫున అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత కల్పించేలా చూస్తున్నామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ములుగులో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన కార్యకర్తలకు దళితబంధు అందించేలా అదిష్టానం వ్యూహరచన చేస్తుందన్నారు. శక్తి వంచన లేకుండా పనిచేస్తున్న కార్యకర్తల కుటుంబానికి గృహలక్ష్మీ పథకం ద్వారా లబ్ధి చేకూర్చేలా చూస్తామన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాదం ప్రవీణ్‌కుమార్, దండుగుల మల్లయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి, కోఆప్షన్ సభ్యురాలు వలీయాబీ, చంద్రం, ఎంపీపీ వీణశ్రీ, బండారి చంద్రయ్య, మధుసూదన్‌రెడ్డి, దిడ్డి మోహన్‌రావు, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతుకు చర్యలు



చెరువును పరిశీలిస్తున్న అప్పయ్య

ఎస్ఎస్ తాడ్వాయి: త్వరలోనే చెరువుల మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య అన్నారు. ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కాల్వపల్లి గ్రామంలోని అనంతాల, గంగమాంబ చెరువులను ఆయన ఆదివారం పరిశీలించారు. మండలంలోని కొన్ని చెరువుల మరమ్మతులకు సంబంధిత ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు నివేదికలు సమర్పించాలని, చెరువులను కలెక్టర్ ఆదేశాల మేరకు పున పరిశీలించామన్నారు. అనంతరం కాల్వపల్లి గ్రామంలో శనివారం రాత్రి గాలివాన బీభత్సానికి నష్టపోయిన బాధితులను సర్పంచ్ సంపత్‌రెడ్డితో కలిసి ఆయన పరామర్శించి ఆస్తి నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న నాగమణి ఇళ్లు ధ్వంసం కావడంతో ఆయన పరిశీలించి తాత్కాలిక మరమ్మతుల కోసం ఆర్థిక సాయం అందజేశారు. గాలి బీభత్సంలో నష్టపోయిన వారి వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం మేడారంలోని శివరాంసాగర్ చెరువు కూడా పరిశీలించారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈ సదయ్య, కొప్పుల కార్తీక్, వెంకటరాజ్యం, నర్సింహరావు పాల్గొన్నారు. అనంతరం తాడ్వాయి పీహెచ్‌ఏసీలో డెలివరీ అయిన ఓ మహిళను సందర్శించి తల్లిబిడ్డల ఆరోగ్య పరిస్థితిని వైద్యాధికారి ఆడెపు చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న గోవింద్‌నాయక్

కన్నాయిగూడెం: మండల కేంద్రానికి గ్రంథాలయం మంజూరు కావడం ఎంతగానో ఆనందాన్ని కలిగించిందని, గ్రంథాలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవింద్‌నాయక్ అన్నారు. మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన గ్రంథాలయ నిర్మాణానికి స్థల పరిశీలనతో పాటు గ్రామ పంచాయతీలో ఆశ్రమ పాఠశాల భవనాన్ని పరిశీలించి యువకులకు, వృద్ధులకు, విద్యార్థులకు అనువుగా ఉండే స్థలం కోసం ప్రత్యేకంగా పరిశీలించినట్లు తెలిపారు. కన్నాయిగూడెం మండలం ఏజెన్సీ మండలం కావడంతో ఇక్కడి ప్రజలకు పోటీ పరీక్షల కోసం కావాల్సిన బుక్స్, అన్ని రకాల కథల పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. కన్నాయిగూడెం మండలంపై అధికారులకు ప్రత్యేక శ్రద్ధ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి పూజారి సత్యనారాయణ, సీనియర్ నాయకుడు కావిరి చిన్నికృష్ణ, మధుకర్, సర్పంచ్ ఆలెం ప్రభాకర్, గూర్రేవుల ఉప సర్పంచ్ నాగేశ్వర్‌రావు, పూజారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరటి తోట నేలమట్టం



నేలమట్టమైన అరటి తోటలో విలపిస్తున్న సురేష్

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలో శనివారం కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో ఇంటి పైకప్పులు కూలిపోయాయి. రేగొండ మండలంలోని తిరుమలగిరిలో పర్ష సురేష్‌కు చెందిన ఎకరన్నర అరటి తోట నేల మట్టమైంది. పంటపై ఆశతో అప్పటికే సుమారు రూ.2లక్షల పెట్టుబడి పెట్టానని బాధితుడు ఆదివారం తన ఆవేదనను వెలిబుచ్చాడు. చేతికొచ్చిన పంట నేలమట్టమైందని, మళ్లీ అప్పులే మిగిలాయని బోరున విలపించారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఉత్తుత్తి వెంచర్లు

13 వెంచర్లు.. 57 ఎకరాలు

- అనుమతులు లేకుండానే ఏర్పాటు
- కొరడా ఝుళిపిస్తున్న మున్సిపాలిటీ
- నోటీసులు జారీ, హద్దు రాళ్ల తొలగింపు
- ఇంతకాలం చర్యలు ఎందుకు తీసుకోలేదనే చర్చ

భూపాలపల్లి: జిల్లా కేంద్రంలోని డొల్ల వెంచర్ల గుట్టు బట్టబయలు అవుతోంది. ఎటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన వెంచర్లపై మున్సిపాలిటీ అధికారులు రోజుకో చర్య తీసుకుంటున్నారు. వెంచర్ల యజమానులకు నోటీసులు జారీ చేయడమే కాక హద్దు రాళ్లను కూడా తొలగించారు. అయితే అనుమతి లేని వెంచర్లు ఏర్పడి ఏళ్లు గడిచాక.. ప్లాట్లు అమ్ముకున్నాక.. మున్సిపాలిటీ అధికారులు ఇప్పుడు చర్యలు తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటనే చర్చ సాగుతోంది.

16 వెంచర్లకే అనుమతి..

సింగరేణి బొగ్గు గనులు, కేటీపీపీతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లి పట్టణం జిల్లా కేంద్రంగా రూపుదిద్దుకోవడంతో ఇక్కడి భూములకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో స్థానిక, ఇతర ప్రాంతాలకు చెందిన రియల్ వ్యాపారులు ఇక్కడ వెంచర్లు చేయడం ప్రారంభించారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు అనుమతి పొందిన వెంచర్లు సుమారు 16 మాత్రమే ఉన్నాయి. కానీ ఎటువంటి అనుమతులు లేకుండా, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోకుండా, లే అవుట్ లేకుండా, పూర్తి నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా వెంచర్లు వెలిశాయి. ఇప్పటికే సుమారు 20 వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను పూర్తిగా విక్రయించారు. అనుమతి లేని మరో 13 వెంచర్లలోప్లాట్ల అమ్మకాలు జరుగుతున్నాయి.

ఇంతకాలం ఏం చేసినట్టు..

జిల్లా కేంద్రంలో మొత్తం 57 ఎకరాల్లో 13 అనుమతి లేని వెంచర్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ అధికారులు గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ఆయా వెంచర్లకు అనుమతులు లేవని, ప్లాట్లు కొనుగోలు చేయవద్దని ఈ నెల 16వ తేదీన ప్రకటన జారీ చేశారు. శనివారం ఆ వెంచర్లలోని హద్దురాళ్లను తొలగించారు. అయితే జిల్లా నడిబొడ్డున, జిల్లా, డివిజన్, మున్సిపల్ అధికారులు నిత్యం వెళ్లే రహదారుల్లో 57 ఎకరాల్లో అనుమతి లేని వెంచర్లు ఏర్పాటు చేసినప్పుడు, ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేస్తున్నప్పుడు మున్సిపల్ అధికారులు ఏం చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అనుమతి లేని వెంచర్‌లో హద్దురాళ్లు తొలగించిన మున్సిపల్ అధికారులు

ఇవి అనుమతులు లేకుండానే..

జిల్లా కేంద్రంలోని గుడ్ మార్నింగ్ స్కూల్ సమీపంలో 143 సర్వే నంబర్‌లో రెండు ఎకరాల్లో ఒక వెంచర్, కేటీకే 8వ ఇంక్‌లైన్ రోడ్‌లో 172, 173 సర్వే నంబర్‌లలో రెండెకరాల్లో ఒకటి, కుందూరుపల్లి రోడ్డులో 174, 175 సర్వే నంబర్‌లో నాలుగెకరాల్లో మూడు వెంచర్లు, అదే రోడ్‌లో 181 సర్వే నంబర్‌లో ఐదెకరాల్లో ఒక వెంచర్, ఏఎస్ఆర్ గార్డెన్ వెనుక భాగంలో 309, 310, 319, 320 సర్వే నంబర్‌లలో 25 ఎకరాల్లో మూడు, సన్‌వ్యాలీ పాఠశాల పక్కన 146 సర్వే నంబర్‌లో 14 ఎకరాల్లో మూడు వెంచర్లు, భాస్కరగడ్డ సమీపంలో 361 సర్వే నంబర్‌లో ఐదెకరాల్లో ఒక వెంచర్ అనుమతి లేకుండా ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ల పైనే మున్సిపాలిటీ అధికారులు ఇప్పుడు కొరడా ఝులిపిస్తున్నారు.

పట్టణం శరవేగంగా అభివృద్ధి

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి: జిల్లా కేంద్రమైన భూపాలపల్లి పట్టణం శర వేగంగా అభివృద్ధి చెందటంలో రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలుస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఇటీవల భూపాలపల్లికి వచ్చిన సందర్భంగా మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు తొలి విడతగా రూ.30 కోట్లు మంజూరు చేశారన్నారు. భూపాలపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి డిటెయిల్డ్ సర్వే జరుగుతుందని, నివేదిక వచ్చిన తరువాత ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు రోడ్డు విస్తరణకు సింగరేణి సంస్థ నిధులు మంజూరు చేసిందని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. జూన్ 2వ తేదీ నుంచి 21 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభారఘుపతిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు జనార్దన్, గడ్డం కుమార్‌రెడ్డి, నూనె రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ప్రతిభా పరీక్ష రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

భూపాలపల్లి అర్బన్: ఆశ వర్కర్లకు నిర్వహించనున్న ప్రతిభా పరీక్షను రద్దు చేయాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్టుకొండ లక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆశ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో లక్ష్మి మాట్లాడారు. ఆశ వర్కర్లు 18 సంవత్సరాల నుంచి పని చేస్తున్నట్లు తెలిపారు. ఆశ కార్యకర్తలకు పరీక్ష పెట్టాలని 50శాతం మార్కులు రానివారిని తొలగిస్తామని బెదిరించడం సరికాదన్నారు. ఆశ వర్కర్లకు నెలకు రూ.18వేల కనీస వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేటి నుంచి దశల వారీగా ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు, ఆశ కార్యకర్తలు బందు సాయిలు, రమేష్, సారక్క, శైలజ, రాజేశ్వర్‌రెడ్డి, జయప్రద, రాధిక, రమ, రమక్కలు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో చీడపీడలకు చెక్

- కీటకాల నుంచి మొక్కలకు రక్షణ
- వేరుకుళ్లు తెగులు వ్యాప్తికి బ్రేక్
- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజు


కరీమాబాద్: విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా మొక్కలను ఆశించే చీడ పీడల నుంచి రక్షించుకోవచ్చు. విత్తనాల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులను, వ్యాధికారక కీటకాల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. ముఖ్యంగా మొలకెత్తే విత్తనాలు, లేత మొలకలలో నేల ద్వారా వ్యాపించే తెగుళ్ల వ్యాప్తిని నియంత్రించవచ్చు. విత్తనాలలో అంకురోత్పత్తి మెరుగు పడుతుంది. ఆరు నెలల వరకు వ్యాపించే వేరుకుళ్లు నుంచి మొక్కలకు రక్షణ కల్పిస్తుంది. పంట మొదటి దశలో రసం పీల్చే పురుగులు, వేరు పురుగుల నుంచి రక్షణ ఉంటుంది. తొలి దశలో రసాయన పురుగు మందుల పిచికారీకి అయ్యే ఖర్చు తగ్గుతుంది. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో విత్తన శుద్ధితో కలిగే ప్రయోజనాలను కేవీకే శాస్త్రవేత్త వివరించారు. మూడు రకాలుగా విత్తన శుద్ధి ఉంటుందని పేర్కొన్నారు.


విత్తనాలను పొడిమందుతో శుద్ధి చేస్తున్న రైతు


విత్తనాలను శుద్ధి చేస్తూ..

సీడ్ డ్రెస్సింగ్..

ఇది విత్తన శుద్ధికి సంబంధించి సాధారణ పద్ధతి. ఇందులో రసాయన మందు పొడిని ద్రవంగా మార్చి తడిగా ఉన్నప్పుడు విత్తనానికి పట్టించాలి. తక్కువ ఖర్చుతో కూడిన మట్టి కుండలు, పాలిథిన్‌షీట్లలో విత్తనాలకు కలపవచ్చు. రైతులు ఇంటి వద్ద వీలు కాకుంటే పొలం దగ్గర కూడా విత్తన శుద్ధి చేసుకోవచ్చు.



విత్తన పూత..

విత్తనానికి రసాయన పురుగుమందులు అంటి ఉండడానికి ఒక ప్రత్యేక బైండర్‌ని పురుగుమందుతో కలిపి ఉపయోగించాలి. ఈ పద్ధతిని ఎక్కువగా విత్తన పరిశ్రమల్లో ఉపయోగిస్తారు.

విత్తన పెల్లెటింగ్..

ఇది అత్యంత అధునాతనమైన విత్తన శుద్ధి పద్ధతి. దీంతో విత్తనం భౌతిక ఆకృతి మారుతుంది. పెల్లెటింగ్‌కు ప్రత్యేకమైన మిషనరీ, టెక్నిక్‌లు అవసరముంటాయి. ఖరీదైన విత్తన శుద్ధి పద్ధతి కాబట్టి కంపెనీల్లో ఉపయోగిస్తారు.

విత్తనశుద్ధితో పంటలకు మేలు



రైతులు విత్తనాలను శుద్ధి చేసుకోవడం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. మొక్క దశలో వివిధ రకాల మందులు పిచికారీ చేయడానికి అయ్యే ఖర్చు తగ్గుతుంది. అంతేకాకుండా విత్తనం మొలకెత్తే సమయంలోనూ చీడ పీడలు గింజలను ఆశించకుండా కాపాడుతుంది. తెగుళ్లు, ముడతలు రాకుండా మొక్కలను రక్షించుకోవచ్చు. మోతాదు ప్రకారం మందులు కలిపి విత్తనాలను శుద్ధి చేసుకోవాలి.

– డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

పంటలు-విత్తన శుద్ధి-రసాయనాల వాడకం

చెరుకు : విత్తన శుద్ధి ద్వారా వేరు తెగులు, ఎండు తెగులు వ్యాప్తిని తగ్గిస్తుంది. చెరుకు గడలకు కార్బండిజం, ట్రైకోడెర్మా లాంటి మందులు వాడుకోవాలి.

వరి : పంటలో వేరుకుళ్ల వ్యాధిని తగ్గించడానికి విత్తనాలకు ట్రైకోడెర్మా, క్లోరోఫైరిఫాస్, సూడోమోనాస్, ఫ్లోరోసెన్స్ వాడాలి. పురుగులను తగ్గించడానికి మోనోక్రోటోఫాస్ ద్రావణంలో విత్తనాలను ఆరు గంటలు నానబెట్టాలి.

మిరప : మిరప విత్తనాలకు ఆంత్రాక్నోస్, డంపింగ్ ఆఫ్ ద్వారా వచ్చే వ్యాధిని తగ్గించడానికి ట్రైకోడెర్మా విరిడి, కార్బండిజం మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నేల ద్వారా సంక్రమించే శిలీంధ్ర వ్యాధులను తగ్గించడానికి ట్రైకోడెర్మా విరిడితోపాటు సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ విత్తనాలకు కలిపి శుద్ధి చేయాలి. రసం పీల్చే పురుగులు, పచ్చ పురుగులు, తామర పురుగులు, పేను బంక వ్యాప్తిని తగ్గించడానికి ఇమిడాక్లోప్రైడ్ విత్తనాలకు కలపాలి.

బెండ : బెండలో రసం పీల్చే పురుగులను తగ్గించడానికి ఇమిడాక్లోప్రైడ్, నులి పురుగులను తట్టుకోవడానికి పెసిలోమైసెస్ లిలాసినస్, సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ విత్తనాలకు కలిపి శుద్ధి చేయాలి.

టమాట..: శిలీంధ్ర వ్యాధి, ఆకు ముడత, కాండం కుళ్లు, ఎండు తెగులు తట్టుకోవడానికి ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్, వర్టిసిల్లియమ్ క్లామిడోస్పోరియం విత్తనానికి కలపాలి.

రెండు తలల పాము పట్టివేత


పామును అటవీ శాఖ సిబ్బందికి అప్పగిస్తున్న దృశ్యం

వాజేడు : ఆదివారం రెడ్ శాండ్ బోవా అనే రెండు తలలపాము (శిఖండి) దొరకడంతో పట్టుకున్న వ్యక్తులు అటవీ శాఖ సిబ్బందికి అప్పగించారు. మండల పరిధిలోని ప్రగళ్లపల్లి శివారులో ఆదివారం శిఖండి రోడ్డు దాటుతుండగా గుర్తించిన వెంకటాపురం(కె)కు చెందిన భార్గవ్, సర్వేశ్వర్‌రావు పట్టుకున్నారు. వెంకటాపురం(కె) లోని రేంజ్ కార్యాలయానికి వెళ్లి వాజేడు, వెంకటాపురం(కె), దూలాపురం రేంజ్ కార్యాలయాల సిబ్బందికి అప్పగించారు. సమీప అడవిలో వాజేడు, వెంకటాపురం(కె) సిబ్బంది సహకారంతో వదిలేసినట్లు వాజేడు రేంజర్ చంద్రమౌళి తెలిపారు.

'నకిలీ'పై నజర్

- అక్రమాలకు పాల్పడితే చర్యలు
- విత్తన టాస్క్‌ఫోర్స్ ఏడీఏ శ్రీదేవి


శ్రీరామ విత్తన ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీదేవి

నెక్కొండ: ఖరీఫ్ ప్రారంభం కాకముందే పలు చోట్ల ఇటు వ్యవసాయ శాఖ, అటు పోలీస్‌శాఖ విత్తన నిల్వలు గల షాపులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడం ప్రారంభించారు. అయితే గతంలో జిల్లాలో అక్కడక్కడ నకిలీ విత్తనాలు విక్రయానికి పాల్పడడంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం (కమిషనర్ కార్యాలయం విత్తన టాస్క్‌ఫోర్స్ అధికారులు) రంగంలోకి దిగారు. మండల కేంద్రంలోని విజయలక్ష్మి, శ్రీభాగ్యలక్ష్మి ఫెర్టిలైజర్స్, సాయి శ్రీనివాస్ సీడ్స్, విజయ ఏజెన్సీస్ దుకాణాల్లో ఆదివారం దాడులు జరిపి, విస్తృత తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా నిల్వ ఉంచిన విత్తన ప్యాకెట్లు, వాటి ధ్రువీకరణ ఆధారపత్రాలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ శాఖ విత్తన ఏఈఏ వి.శ్రీదేవి మాట్లాడుతూ ఏటా సీజన్ ముందు ప్రతీ విత్తన షాపులను తనిఖీ చేస్తామన్నారు. అనుమతులు లేని షాపుల్లో విత్తనాలను రైతులు కొనుగోలు చేయ్యవద్దని సూచించారు. అలాగే గ్రామాల్లో అనుమతులు లేకుండా విత్తనాలు అమ్మే వారి వివరాలను వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలనిపేర్కొన్నారు. అలాగే బిటా–3 పత్తి విత్తనాలు విక్రయించవద్దన్నారు. విత్తన డీలర్లు అనుమతి లేని గోదాంలలో విత్తన నిల్వలు ఉంచవద్దని, విధిగా స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్‌లను నిర్వహించాలని ఆమె సూచించారు. దాడుల్లో ఆ శాఖ విత్తన ధ్రువీకరణ అధికారి కె. విజయ్‌కుమార్, నర్సంపేట ఏడీఏ జె. అవినాష్‌వర్మ, నెక్కొండ ఏఓ ఎగిడి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : ఖరీఫ్ సీజన్‌లో రైతులు కొనుగోలు చేసే విత్తనాల ప్యాకెట్‌ల వివరాలను డీలర్లు, షాపు యాజమానులు తప్పనిసరిగా బిల్లులో నమోదు చేయాలని కమిషనర్ ఆఫీసర్ ఏడీఏ శ్రీదేవి, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముగ్దుంపురంలో శ్రీరామవిత్తనోత్పత్తి సంఘం ప్రాసెసింగ్ ప్లాంట్ ఆదివారం కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి సీడ్స్ ట్రాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేపట్టింది. అనంతరం పట్టణం, మండలంలోని విత్తనషాపులను తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్ వివరాలను, గోదాములను పరిశీలించారు. వారి వెంట నర్సంపేట ఇన్‌చార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు అవినాష్ వర్మ, ఏఓ క్రిష్ణకుమార్ ఉన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- గంట వ్యవధిలో 13 మందిపై దాడి
- రెండు గ్రామ పంచాయతీల్లో ఘటనలు





గాయపడిన చిన్నారి శ్వేత, గుగులోతు బుల్లి, కార్తీక్, బానోతు హోలీ

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకట్‌తండా, స్టేజీతండా జీపీల్లో ఆదివారం ఓ పిచ్చికుక్క స్వైరావిహారం చేసి గంట వ్యవధిలోనే 13 మందిని తీవ్రంగా గాయపర్చింది. స్థానికుల కథనం ప్రకారం.. మొదట స్టేజితండా జీపీ పరిధి మేగ్యాతండా (బడ్డతండా)లోని వీధుల్లో పిచ్చికుక్క తిరుగుతూ కనిపించిన వారిపై దాడి చేసింది. దీంతో గుగులోతు మోహన్, బోడ కీమా, భూక్య భద్రు, భూక్య కార్తీక్, భూక్య చరణ్‌తో పాటు అక్కడే వెంచర్ వద్ద తల్లిదండ్రులతో ఉన్న 9 ఏళ్ల బాలిక తీవ్రంగా గాయపర్చింది. ఈ క్రమంలో తండావాసులు పిచ్చికుక్కను వెంబడించగా.. పక్కనే ఉన్న వెంకట్‌తండా జీపీలోకి చొరబడింది. అక్కడ కూడా తారసడ్డ గుగులోతు రాంలాల్, గుగులోతు విజయ, గుగులోతు బుల్లి, గుగులోతు ఈక్య, బానోతు హోలీ, బాలుడు సాయితేజ, మరో బాలికడిపై దాడి చేసింది. గంట వ్యవధిలోనే మొత్తం 13 మందిని పిచ్చి కుక్క గాయపర్చింది. అనంతరం తండా ప్రజలంతా కలిసి ఆ కుక్కను హతమార్చారు. వెంకట్‌తండా సర్పంచ్ గుగులోతు సూరనాయక్ స్పందించి గాయపడ్డ వారిని మరిపెడ పీహెచ్‌సీకి తరలించారు. తీవ్ర గాయాలైన వారిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి పంపించి చికిత్స చేయిస్తున్నారు.

పెట్రోల్‌లో నీళ్లు

- ఖంగుతిన్న అధికారులు
- తాత్కాలికంగా నిలిపివేత


నీళ్లు వచ్చిన బాటిల్‌ను చూపుతున్న వినియోగదారుడు

మంగపేట: మండల కేంద్రం పరిధిలోని గంపోనిగూడెం సమీపంలో మార్కెట్ యార్డు వద్ద నూతనంగా ఏటూరునాగారం గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో పెట్రోల్‌తో పాటు నీళ్లు రావడంతో వాహనదారులు ఖంగుతిన్నారు. ఆదివారం బాధిత వినియోగదారులు తెలిపిన కథనం ప్రకారం.. పెట్రోల్ బంక్‌ను జీసీసీ అధికారులు ఈనెల 20 శనివారం ట్రయల్ రన్ చేసి ప్రారంభించారు. ఆదివారం ఉదయం మండలంలోని చెరుపల్లికి చెందిన దిడ్డి లక్ష్మినర్సయ్య తన కారులో రూ.2,510 పెట్రోల్ పోయించుకుని కొద్దిదూరం వెళ్లగానే కారు ఆగిపోయింది. అదే సమయంలో కమలాపురంకు చెందిన ఓ యువకుడు, ఇతర వాహనదారులు పెట్రోల్ పోయించుకోగా నీళ్లు వస్తున్న విషయాన్ని గుర్తించారు. లక్ష్మినర్సయ్య ఒక బాటిల్‌లో పెట్రోల్ పోయించి పరిశీలించగా సగం పెట్రోల్, సగం నీళ్లు వచ్చినట్లు గుర్తించి బంక్ నిర్వాహకులను నిలదీశారు. దీంతో నీళ్లు ఎలా వచ్చాయో తమకు తెలియదని ఈ విషయాన్ని తమ అధికారులకు సమాచారం ఇస్తున్నాం వారు వచ్చే వరకు వేచి ఉండాలని చెప్పడంతో కొంత సేపు వేచి చూసినా సంబంధిత అధికారులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్‌లో నీరు రావడానికి పూర్తి బాధ్యత వహించాలని చెప్పి కారును బంక్‌లోనే ఉంచి వేరే కారులో వెళ్లిపోయారు. ట్రయల్ రన్ మొదలు పనెట్టిన అధికారులు భూమిలో అమర్చిన పెట్రోల్ ట్యాక్, పైప్‌లైన్ నీళ్లు ఉన్న విషయాన్ని గుర్తించకుండా ఆదివారం నుంచి విక్రయాలు ప్రారంభించడంతో సమస్య తలెత్తిందా లేక మరేమైనా జరిగి ఉంటుందా అని వినియోగదారులు అనుమానం వ్యక్తం చేశారు. బంక్ నిర్వాహకులు సంబంధిత జీసీసీ అధికారుల దృష్టికి తీసుకుపోగా తాత్కాలికంగా విక్రయాలను నిలిపివేశారు. ఈ విషయంపై జీసీసీ డీఎం ప్రతాపరెడ్డిని వివరణ అడిగేందుకు ఫోన్‌లో సంప్రదించగా తాను తర్వాత మాట్లాడుతానని మెసేజ్ పెట్టారు.

అడవి పందులను తరలిస్తున్న వాహనం పట్టివేత


వాహనాన్ని ఫారెస్టు అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు

చిల్పూరు : నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది అడవి పందుల వాహనాన్ని పట్టుకుని వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్పెషల్ బ్రాంచి అధికారుల విశ్వసనీయ సమాచారం మేరకు టాటాఏస్ ట్రాలీలో అడవి పందులను అక్రమంగా తరలిస్తుండగా నష్కల్ అండర్ బ్రిడ్జి వద్ద పట్టుకుని విచారించగా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వద్ద తక్కువ ధరకు అడవి పందులను కొనుగోలు చేసి మాంసం అమ్ముకుని డబ్బులు సంపాదించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిసిందన్నారు. అడవి పందులను అక్రమంగా తరలిస్తున్న ఐనవోలు మండలం వెంకటాపూర్‌కు చెందిన రాయపురం సురేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి అడవి పందులను ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో అన్నాదమ్ములు దుర్మరణం

- ఒకరికి గాయాలు..
- అనాథలైన తల్లిదండ్రులు


అభిషేక్ (ఫైల్)


ఆశిష్ (ఫైల్)

టేకుమట్ల: బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో అన్నాదమ్ముళ్లు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని గర్మిళ్లపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా కేంద్రంలోని గోపాలస్వామిగుడి ప్రాంతానికి చెందిన ఎంజీఎం ఉద్యోగి జన్ను ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని గర్మిళ్లపల్లికి చెందిన సమీప బంధువు దాసారపు కొమురయ్య ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. ఆదివారం కారులో ప్రసాద్ పెద్ద కుమారుడు జన్ను ఆశిష్(17), చిన్న కుమారుడు అభిషేక్(15)లు దాసారపు జానీలు కలిసి గ్రామసమీపంలోకి బహిర్భూమికి వెళ్తుండగా డబుల్‌బెడ్రూం ఇండ్ల సమీపంలో కారు అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తీసుకువెళ్ల అభిషేక్ మృతి చెందినట్లు తెలిపారు. ఆశిష్‌ను మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. జానీని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

ఇంట్లో కమ్ముకున్న చీకటి.....

జన్ను ప్రసాద్–తిరుమలకు ఇద్దరు కుమారులే లోకంగా బతుకుతున్న వారి కుటుంబంలో కారు ప్రమాదం రూపంలో వారిద్దరినీ బలి తీసుకుంది. మొత్తం ఇంటినే చీకటి కూపంలోకి నెట్టినట్లుగా ఉంది. ఓ దేవుడా మేమేం పాపం చేశాం, మమ్మల్ని దిక్కులేని వారిని చేసావు అంటూ, అనాథలను చేసి వెళ్లిపోయారా బిడ్డలారా అంటూ రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు

వాజేడు : మండల పరిధిలోని మండపాక సమీపంలోని పుల్ల చెలిమెలు ప్రాంతంలో 163 నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వెంకటాపురం(కె) మండల పరిధిలోని బర్లగూడెంకు చెందిన తల్లడి రవి(39) తన స్నేహితుడి బైక్‌పై ఏటూరు నాగారం మండలం వెళ్లి అక్కడి నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో వెంకటాపురం(కె) మండల పరిధిలోని పాత్రాపురం(మంగవాయి) గ్రామానికి చెందిన ముగ్గురు బైక్‌పై ఏటూరునాగారం వెళ్తున్నారు. వాజేడు మండలం మండపాక సమీపంలోని పుల్ల చెలిమెలు ప్రాంతానికి రాగానే రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో తల్లడి రవి తలకు బలమైన గాయమైంది. వెంటనే ఏటూరునాగరం సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ములుగు తరలించాలని తెలుపడంతో ఆస్పత్రి నుంచి వాహనంలోకి మారుస్తుండగానే చనిపోయాడు. వేరే వాహనంపై వచ్చిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య ప్రమీల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.


ఉపేందర్ మృతదేహం

బైక్ అదుపు తప్పి ఒకరు..

మరిపెడ రూరల్: బైక్ అదుపు తప్పి మీద పడడంతో ఊపిరాడక ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని గాలివారిగూడెం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం...గాలివారిగూడెంకు చెందిన ఆలుదాసు ఉపేందర్ (44) తాపీమేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే తన బైక్ (టీవీఎస్ ఎక్సెల్)పై స్వగ్రామం నుంచి మరిపెడ బంగ్లాకు పనుల నిమిత్తం వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారు ధారావత్ వెంకన్న పొలం వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన కిందపడ్డాడు. బండి అతని ముఖంపై పడడంతో ఊపిరాడక చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

వడదెబ్బతో ఆటోడ్రైవర్ మృతి


కుమారస్వామి మృతదేహం

దుగ్గొండి: వడదెబ్బ బారిన పడి ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. హన్మకొండ జిల్లా మడికొండ మండల కేంద్రం ఇందిరమ్మ కాలనీకి చెందిన పెరుమాండ్ల కుమారస్వామి (55) ఆటో నడుపుకుంటూ లక్ష్మీపురం వచ్చాడు. తిరుగుప్రయాణంలో ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా దాహం వేయడంతో ఆటోను ఆపాడు. సమీపంలో ఓ ఇంట్లో మంచినీరు అడిగి తాగాడు. అనంతరం ఆటోలో కూర్చొని చాతిలో నొప్పి అంటూ ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మార్కెట్‌లో షెడ్ల కిందే విక్రయాలు

వరంగల్ : వేసవి ఎండల తీవ్రత పెరిగిపోతుండడంతో నేటి (సోమవారం) నుంచి మార్కెట్‌లో షెడ్ల కిందే సరుకుల క్రయవిక్రయాలు చేపట్టాలని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్ష, కార్యదర్శులు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గుమాస్తాల సంఘం, అడ్తిదారుల సంఘాలతో జరిగిన సంయుక్త సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాలను ఛాంబర్ ఆఫ్ కామర్స్ అడ్తి సెక్షన్ సభ్యులందరికీ తెలియజేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ వ్యాపార లావాదేవీలు చేపట్టే గుమాస్తాలు వడదెబ్బ బారిన పడకుండా జూన్ 10 వరకు మార్కెట్‌కు సెలవులు ప్రకటించేందుకు తగు చర్యలు తీసుకోవాలని వరంగల్ గ్రెయిన్ మార్కెట్ గుమాస్తా సంఘం చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఇచ్చిన లేఖపై రెండు రోజుల క్రితం ఛాంబర్ ఆధ్వర్యంలో గుమస్తా సంఘం ప్రతినిధులు, మార్కెట్ సంబంధిత సెక్షన్ల ప్రతినిధులతో జరిగిన సంయుక్త సమావేశంలో ఇరువర్గాలు సుదీర్ఘంగా చర్చించాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో 22వ తేదీ నుంచి రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చే అన్ని సరుకులను మార్కెట్ యార్డులోని షెడ్ల కిందే వేయించి వ్యాపార లావాదేవీలు నిర్వహించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని పేర్కొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


సురేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రేగడితండలో ఆదివారం చోటుచేసుకుంది. కురవి ఎస్సై బి.రాము తెలిపిన వివరాల ప్రకారం...రేగడి తండకు చెందిన ఇస్లావత్ సురేష్ (27) వ్యవసాయం, కూరగాయలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నాడు.రెండు రోజుల క్రితం సురేష్, భార్య పార్వతి కలిసి తిరుపతికి దర్శనానికి వెళ్లారు. శనివారం సాయంత్రం రేగడితండాకు రాగా భార్యభర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సురేష్ మనస్తాపానికి గురై ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి మాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) హెడ్‌కానిస్టేబుల్ సస్పెండైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం రాత్రి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17న రైల్వే డీజిల్ లోకోషెడ్ ఆర్‌పీఎఫ్ ఔట్‌పోస్టులో హెడ్‌కానిస్టేబుల్ బాలసుబ్రమణ్యం, కానిస్టేబుల్ పాశ్వాన్‌లు విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు మధ్య వచ్చిన వాదనలపై బాలసుబ్రమణ్యం పాశ్వాన్‌పై చేయి చేసుకున్నాడు. దీంతో పాశ్వాన్ ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఉన్నతాధికారుల ఆదేశానుసారం బాలసుబ్రమణ్యంను సస్పెండ్ చేసి పర్లీ డివిజన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ పోలీస్


ఎంజీఎంలో రాజుతో ట్రాఫిక్ పోలీస్ స్వామి

ఎంజీఎం: నగరంలోని ములుగు రోడ్డు జంక్షన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీస్ వావిలాల స్వామి గుండెపోటు గురైన ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం ములుగు రోడ్డు వద్ద హనుమకొండ అలంకార్ ప్రాంతంలోని రేషన్ డీలర్ రాజు బైక్‌పై ప్రయాణిస్తూ ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలాడు. గమనించిన ట్రాఫిక్ పోలీస్ స్వామి హుటాహుటిన అక్కడికి చేరుకొని రాజుకు సీపీఆర్ చేయడంతో అతనికి స్పృహ వచ్చింది. వెంటనే మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. నిండు ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ పోలీస్ వావిలాల స్వామి పలువురు అభినందించారు.